తాగునీటి సమస్యను పరిష్కరించాలి


ప్రజావాణిలో వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నేతలు

మేడ్చల్: పట్టణంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని పట్టణ బీజేపీ నేతలు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం అందజేశారు. గతంలో మిషన్ భగీరథ ద్వారా నీరు సరఫరా అయ్యేదని ప్రస్తుతం సరఫరా కాకపోవడంతో తీవ్ర నీటి సమస్య ఏర్పడిందన్నారు. మున్సిపల్ బీజేపీ నేతలు శైలజ, ప్రేమ్‌దాస్, శ్రీకాంత్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఇదే సమస్యపై మండల సీపీఎం నేతలు సైతం వినతిపత్రం ఇచ్చారు.

ప్రత్యేక ఇల్యూమినేట్ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ-సెల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఇల్యూమినేట్ వర్క్‌షాప్ నిర్వహించారు. వ్యాపారవేత్త, స్టార్టప్ మెంటర్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ఇన్‌స్టిట్యూట్, పరిశ్రమల మధ్య సహకారంతో ఇంజినీరింగ్ విద్యార్థుల్లో వ్యాపారవేత్త దృక్పథం అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు ఉద్యోగం పొందడం కాకుండా, ఉద్యోగాలను సృష్టించే దిశగా ఆలోచించాలన్నారు. వర్క్‌షాప్‌లో 70 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల సెక్రటరీ టీ.వీ.రెడ్డి, డైరెక్టర్లు సరోజారెడ్డి, అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామస్వామిరెడ్డి, పీఆర్వో రవి సుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ షెడ్డును తొలగించాలని ఫిర్యాదు

ఘట్‌కేసర్: అక్రమంగా రోడ్డుపై నిర్మించిన షెడ్డును తొలగించాలని మర్పల్లిగూడకు చెందిన శివరాత్రి వెంకటేష్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశాడు. ఎన్‌ఎఫ్‌సీనగర్ బస్టాండ్ వెనకాల ఉన్న ప్లాటు 3 ముందు రోడ్డుపైన అనుమతి లేకుండా షెడ్డు నిర్మించారని లేఖలో పేర్కొన్నారు. విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాడు.

మర్యాదపూర్వక కలయిక


సీఎం రేవంత్‌రెడ్డితో శ్రీకాంత్‌యాదవ్

జవహర్‌నగర్: కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ సోమవారం సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరేలా కృషి చేయాలని సీఎం సూచించినట్లు ఆయన తెలిపారు.

అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న వంగూరి జంగయ్య

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని ప్రతాపసింగారం ప్రాంతానికి చెందిన వంగూరి జంగయ్యకు సమాచార హక్కు చట్ట సాధన కమిటీ అవార్డు లభించింది. నగరంలో జరిగిన కార్యక్రమంలో ఆర్టీఐ కమిషనర్ గోపాల్‌రావు ఈ అవార్డును ప్రదానం చేశారు. సమాచార హక్కు చట్ట సాధన కమిటీలో మేడ్చల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సేవలందిస్తున్న జంగయ్యను అవార్డుతో సత్కరించారు.

స్వచ్ఛతపై విద్యార్థుల అవగాహన


గోధుమకుంటలో జరిగిన కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

కీసర: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో కీసర గోధుమకుంట ప్రభుత్వ పాఠశాలలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆశావర్కర్లతో ఇంటింటికి వెళ్లి పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. రహదారులపై జరిగే వాహన, ఇతర ప్రమాదాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీఓ పద్మజ, విద్యార్థులు పాల్గొన్నారు.

విన్నవించుకున్నా వినరా..?


పూడూర్ చౌరస్తా పక్కన పారవేసిన చెత్త, చెదారం

రోడ్డు పక్కన విచ్చలవిడిగా వ్యర్థాల పారబోత

- ఓ వైపు అవగాహన, మరోవైపు పారబోత
- చెత్త వేయకూడదని వేడుకుంటున్న స్వచ్ఛ కార్మికులు

మేడ్చల్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ఎటు చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. రోడ్డు పక్కన, కాలనీలు ఖాళీ స్థలాలు, చెరువుల సమీపంలో ప్రజలు చెత్తను పారవేస్తుండటంతో ఆ ప్రాంతాలు, రోడ్డుపై వెళ్లే వారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే పారబోత..

ముఖ్యంగా మాంసం విక్రయదారులు, దుకాణదారులు తమ దుకాణాల్లో చెత్తను కవర్లు, బ్యాగుల్లో నింపి రాత్రి వేళల్లో రోడ్డు పక్కన పారవేస్తున్నారు. మరోవైపు పలు కాలనీలు, మున్సిపల్ పరిధిలోని గ్రామాల్లో నివాసం ఉండే ఇతర ప్రాంతాలకు చెందిన వారు తమ ఇళ్లలోని చెత్తను పనులకు వెళ్లే సమయాల్లో ఖాళీ ప్రదేశాలు, రోడ్డు పక్కన పారవేసి వెళ్తున్నారు.

విన్నవించుకున్నా వినడం లేదు..

మున్సిపల్ పరిధిలోని పూడూర్ గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులు రోడ్డు పక్కన, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను పారవేయకూడదని, పలుమార్లు వినూత్నంగా విన్నవించుకున్నారు. గ్రామం నుంచి పూడూర్ చౌరస్తాకు వెళ్లే రోడ్డులో చెత్త వేసే ప్రదేశాల్లో ముగ్గులు వేయడం.. 'దయచేసి చెత్త వెయ్యకండి'.. అంటూ వీడియోలు తీసి సామాజిక మాధ్యమాల్లో పెట్టి విన్నవించుకున్నారు. కానీ వారి విన్నపాలను పెడ చెవిన పెట్టడమే కాకుండా కొందరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు.

☛ పట్టణంలోని పలు కాలనీల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొంది. మేడ్చల్ - కిష్టాపూర్ రోడ్డులో వాగు వద్ద చికెన్‌షాప్ నిర్వాహకులు, ఇతర దుకాణదారులు విచ్చలవిడిగా వ్యర్థాలు వాగులో వేసి వెళ్తున్నారు. చెత్త పారబోతపై సాక్షి కథనాలు ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు చెత్తవేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డు పెట్టింది. దీంతో చెత్త వేసే వారు ఆ ప్రదేశంలో వేయకుండా నేరుగా వాగు నీటిలో వేస్తున్నారు.

నిర్లక్ష్యం కూడా కారణమే...

ప్రజలు విచ్చలవిడిగా చెత్త పారబోతకు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం ఓ కారణమంటూ.. పలువురు అభిప్రాయపడుతున్నారు. వార్డుల్లో ప్రజల ఇళ్ల వద్దకు దుకాణాల వద్ద చెత్త సేకరణ వాహనాలు నిత్యం వెళ్లకపోవడం వల్ల వారు తమ ఇళ్లు, దుకాణాల్లోని చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేస్తున్నారు. ఉదయాన్నే స్వచ్ఛ వాహనాలు ఇళ్ల వద్దకు వచ్చి చెత్త సేకరించకపోవడంతో ఇళ్లలోని చెత్తను వారు కవర్‌లలో వేసి విధులకు వెళ్లే సమయాల్లో రోడ్డుపక్కన, ఖాళీ స్థలాల్లో వేసి వెళ్తున్నారు. మున్సిపల్ అధికారులు దీనిపై దృష్టి సారించి తగిన చర్యలు తీసుకుని స్వచ్ఛ మేడ్చల్‌గా తీర్చిదిద్దాలని కోరుతున్నారు.

జరిమానాలు విధిస్తున్నాం..

రోడ్డు పక్కన వ్యర్థాలు పారవేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తాం. ఇప్పటికే పలువురికి జరిమానాలు విధించాం. చెత్త సేకరణ వాహనాలు ప్రతిరోజు ఇళ్ల వద్దకు వెళ్తున్నాయి. సమస్య పరిష్కారానికి మరిన్ని చర్యలు చేపడతాం. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటిస్తూ స్వచ్ఛత వైపు అడుగేయాలి.

– చంద్రప్రకాశ్, మేడ్చల్ కమిషనర్



సీపీఆర్‌పై అవగాహన

జిల్లా వ్యాప్తంగా వారోత్సవాలకు వైద్యశాఖ పిలుపు



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ అవరణలో 'పునర్జన్మ' పేరుతో సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సహా ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ప్రజలకు సీపీఆర్ గురించి వివరించారు. పునర్జన్మ వారోత్సవాల్లో భాగంగా వారం రోజుల పాటు జిల్లాలోని విద్యాసంస్థలు, బస్టాండ్‌లు, రైల్వేస్టేషన్ వంటి స్థలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఉమాగౌరి, ప్రోగ్రామ్ అధికారి మల్లీశ్వరి, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు విజయకుమారి, ఝాన్సీరాణి, చంద్రకళ, సుగుణబాయి, సాంబశివరావు, వినోద్‌కుమార్, స్వర్ణలత, జిల్లా వైద్యారోగ్యశాఖ ప్రోగ్రామ్ అధికారులు గీతా, శ్రీదేవి, సత్యవతి, వసంతకుమారి, సంతోష్ వైద్యులు పాల్గొన్నారు.


పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల పరిశీలకురాలు అంజలి నింబాల్కర్

శామీర్‌పేట్: పారదర్శకంగా డీసీసీ అధ్యక్షుడి ఎన్నిక ఉంటుందని ఏఐసీసీ కార్యదర్శి, జిల్లా ఎన్నికల పరిశీలకురాలు అంజలి నింబాల్కర్ అన్నారు. సోమవారం మేడ్చల్ జిల్లా, అంతాయిపల్లిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ముఖ్యనాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అనంతరం డీసీసీ అధ్యక్ష పదవికి నామినేషన్లను స్వీకరించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలను గుజరాత్‌లో ప్రారంభించి తెలంగాణకు వచ్చామని, కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా అన్ని వ్యవస్థలను పటిష్టం చేస్తున్నామన్నారు. డీసీసీ ఎన్నికకు అన్ని వర్గాల స్థాయి కార్యకర్తల నుంచి వివరాలు సేకరిస్తామన్నారు. మండలం, బ్లాక్, జిల్లాస్థాయిలో కార్యకర్తల అభిప్రాయాలు సేకరిస్తామని తెలిపారు. కాగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి 7 నామినేషన్లు వచ్చాయన్నారు. పీసీసీ పరిశీలకురాలు ఇందిర, మేడ్చల్ జిల్లా పార్టీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ మహిపాల్‌రెడ్డి, వివిధ మండలాల అధ్యక్షుడు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

ఇంజెక్షన్ వికటించి యువకుడి మృతి

- ఆసుపత్రి ఎదుట మృతుడి బంధువుల ఆందోళన
- అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం లాఠీఛార్జ్
- పోలీసులకు గాయాలు మరో కోణంలో దర్యాప్తు


మహేష్‌యాదవ్ (ఫైల్)


ఆందోళన చేపట్టిన మృతుడి బంధువులు, కుటుంబసభ్యులు

కీసర: అస్వస్థతతో ప్రైవేటు ఆసుపత్రికి చికిత్సకోసం వచ్చిన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు, మృతుడి కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి-భువనగిరి జిల్లా పగిడిపల్లికి చెందిన తోటకూరి మహేష్‌యాదవ్(35) ఆదివారం కీసరలోని అత్తగారింటికి కుటుంబసభ్యులతో కలిసి బోనాల పండుగకు వచ్చారు. రాత్రి అందరితో కలిసి భోజనం చేసిన అతడికి ఒక్కసారిగా ఛాతీలో నొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు 3 ఇంజక్షన్లు ఇచ్చాడు. కొద్దిసేపటికే ఈసీజీలో తేడా రావడంతో మరో ఆసుపత్రికి సిఫార్సు చేశాడు. దీంతో బంధువులు నాగారంలోని మరో ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు ధ్రువీకరించారు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు కీసరలోని ప్రైవేటు ఆసుపత్రికి మృతదేహంతో వచ్చి ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యమే కారణంగానే మృతిచెందాడని ఆరోపిస్తూ.. సోమవారం తెల్లజామున 2.30 గంటల వరకు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. మృతుడి స్వగ్రామం నుంచి కుడా పెద్దఎత్తున జనాలు తరలిరావడంతో పరిస్థితి మరింత ఉద్రుతంగా మారింది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రి వద్దకు చేరుకుని మృతుడి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అయినా ఆందోళన విరమించకపోగా.. ఆసుపత్రి అద్దాలు, ఫర్నిచర్, సీసీ కెమెరాలు ధ్వంసం చేశారు.

రంగంలోకి ప్రత్యేక బలగాలు..

ఆందోళనతో పరిస్థితి చేయిదాటిపోతుండటంతో పోలీసులు ప్రత్యేక బలగాలను రంగంలోకి దింపారు. కొందరు ఆసుపత్రి, పోలీసులపైకి రాళ్లు రువ్వడంతో కుషాయిగూడ ఏసీపీ వెంకట్‌రెడ్డికి స్వల్ప గాయం కాగా.. పోలీసు వాహనం డ్రైవర్‌తో పాటు ప్రత్యేక బలగాలలో 5 మంది పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పోలీసులు లాఠీచార్జ్ చేసి అందరిని చెదరగొట్టారు. ఈ ఘటనలో మూడు కేసులు నమోదు చేసినట్లు కీసర ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు తెలిపారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆసుపత్రిపై కూడా కేసు నమోదు చేశామని చెప్పారు. ఇంజక్షన్‌తోనే మృతి చెందాడా.. ఇతర అనారోగ్య సమస్యలేమైనా ఉన్నాయా.. అనేకోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించామన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు..

స్పందించిన అధికారులు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో అక్రమంగా నిర్మిస్తున్న భవనంపై మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోచారం మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్ ఫిర్యాదు వచ్చిన భవనాన్ని పరిశీలించి పనులను నిలిపివేయాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే పలు భవనాలపై కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులు రావడంతో మరిన్ని భవనాలపై చర్యలు తీసుకునే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పేదలకు మెరుగైన సేవలు అందించాలి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిత్యసాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన నిత్యసాయి ఆస్పత్రిని సోమవారం నిజామాబాద్, మల్కాజిగిరి ఎంపీలు ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్‌లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. పేదవారికి మెరుగైన వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేసి పలు జిల్లాల్లో ఇదివరకే ఆస్పత్రితో పాటు ఇతర కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. పేదవారికి ఉత్తమ సేవలు అందించాలని కోరారు. వైద్యులు రాఘవేందర్‌రావు, హైమారెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ సంజయ్, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీ ఎల్.రమణ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, వైద్యులు, నాయకులు పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమను ఆదుకోవాలి


మాట్లాడుతున్న బీఎమ్ఎస్ అఖిల భారత సంఘటన్ కార్యదర్శి సురేంద్ర

పోచారం: కార్మికుల సంక్షేమంతో పాటు బీడీ పరిశ్రమను ఆదుకోవాలని బీఎమ్ఎస్ అఖిల భారత సంఘటన్ కార్యదర్శి సురేంద్ర అన్నారు. సోమవారం పోచారం మున్సిపాలిటీ పరిధిలోని రాష్ట్రీయ విద్యా కేంద్రం, అన్నోజిగూడలో అఖిల భారతీయ బీడీ మజ్దూర్ మహాసంఘ్ 15వ త్రైవార్షిక మహాసభలు నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ.. అన్ని రంగాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. దక్షిణ మధ్య సంఘటనా కార్యదర్శి దొరై రాజు, జాతీయ కార్యదర్శి రాధాకృష్ణ, బీడీ మజ్దూర్ మహాసభ అధ్యక్షుడు ఓంప్రకాష్, ప్రతినిధులు కలల శ్రీనివాస్, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

రామంతాపూర్: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ అన్నారు. ఈ మేరకు సోమవారం హబ్సిగూడ డివిజన్ పరిధిలోని గోకుల్‌నగర్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని కాంట్రాక్టర్లపై అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రతిరోజు సంక్షేమ సంఘాల నేతలు పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సాయి కిరణ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్ రాథోడ్, బీజేపీ సీనియర్ నేత ఎల్లాచారితో పాటు పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

రహదారి సమస్యను పరిష్కరించాలి


ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నేతలు

మేడ్చల్: 44వ జాతీయ రహదారి సమస్యను అధికారులు పట్టించుకుని వెంటనే పరిష్కరించాలని మండల సీపీఎం నేతలు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకగా సాగుతున్నాయని, పట్టణవ్యాప్తంగా రోడ్డు మొత్తం గుంతలమయం కావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతూ పదుల సంఖ్యలో ప్రజలు మృతి చెందారన్నారు. నిత్యం గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో వాహనదారులకు ఇబ్బంది తప్పడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. సీపీఎం నేతలు నరేష్, కొమురయ్య, నర్సింగ్‌రావు, పూజ, రమేష్, ప్రశాంత్ తదితరులున్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన


నాగారంలో మాట్లాడుతున్న కమిషనర్ భాస్కర్‌రెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని మారుతి గార్డెన్‌లో సమాచార హక్కు చట్టం వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సోమవారం కమిషనర్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. సమాచార హక్కు చట్టం అనేది ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తివంతమైన సాధనమన్నారు. మున్సిపల్ మేనేజర్ నారాయణరెడ్డి, డీఈఈ సంతోష్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు, సురేష్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సాయిరాజ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబు, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రవణ్‌కుమార్, నిఖిలేశ్వర్, ప్రజాప్రతినిధులు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దమ్మాయిగూడలో...

మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సమాచార హక్కు చట్టం వారోత్సవాలు నిర్వహించారు. కమిషనర్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం గురించి అవగాహన పెంచుకుని, ప్రభుత్వ కార్యకలాపాలపై సమాచారం పొందడంతో పాటు ప్రజాస్వామ్య పరిపాలనలో భాగస్వామ్యం కావాలన్నారు. మేనేజర్ వెంకటేశం, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పట్టుదలతో విద్యను అభ్యసించాలి

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు


ఎన్‌సీసీ కేడెట్లతో ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు, ప్రిన్సిపాల్ శ్రీలత

ఘట్‌కేసర్: విద్య విలువను గుర్తించి పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఏడుకొండలు అన్నారు. సోమవారం అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ భువనగిరి మహిళా కళాశాలలో కౌన్సిల్ సభ్యులుగా బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రిన్సిపాల్ శ్రీలత మాట్లాడుతూ.. కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన వారు విధిగా బాధ్యతలు నిర్వర్తించాలన్నారు. కల్నల్ రాజా దత్త మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని గమ్యం చేరుకునేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన వారిని అభినందించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు.

మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయండి

జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

శామీర్‌పేట్: మాలల రణభేరి మహాసభను జయప్రదం చేయాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య అన్నారు. మాలల రణభేరి మహాసభ విజయవంతమే లక్ష్యంగా జరుగున్న చైతన్యయాత్ర సోమవారం మేడ్చల్‌జిల్లా, తూంకుంట మున్సిపాలిటీకి చేరుకుంది. ఈ సందర్భంగా మాలమహానాడు బృందం శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం బైక్‌ర్యాలీగా ఉప్పరిపల్లిలోని అంబేడ్కర్ విగ్రహం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రప్రభుత్వం ప్రస్తుత జనాభా లెక్కలు లేకుండా 2011 జనాభా లెక్కలతో వర్గీకరణ చేసిందని, రోస్టర్ పాయింట్లు కేటాయింపులో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆరోపించారు. మాలలకు రాష్ట్రప్రభుత్వం చేసిన అన్యాయంపై ప్రశ్నించేందుకు నవంబర్ 23న హైదరాబాద్‌లో జరిగే మాలల రణభేరి మహాసభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మోహనకృష్ణ, నాయకులు లాలుప్రసాద్, లింగం, బాలేష్, రాజు, బలరాం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు !

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి


ప్రజావాణికి 81 అర్జీలు..

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజా సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే స్పందించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగ్‌హాల్‌లో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియలతో కలసి ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం కల్పించే బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ వివరించారు. దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రజావాణి ముఖ్య ఉద్దేశమన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో 81 అర్జీలు వచ్చాయని, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు, రెవెన్యూ, వైద్యం, విద్య, పౌరసరఫరాలశాఖతో సహా ఇతర శాఖలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవికి పోటాపోటీ..

- తొలి రోజే డీసీసీ అధ్యక్ష స్థానానికి 9 దరఖాస్తులు
- ఏఐసీసీ పరిశీలకురాలు అంజలికి సమర్పించిన నాయకులు
- 18 వరకు నియోజకవర్గాల వారీగా సమావేశాలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ అధ్యక్ష పదవి భర్తీకి సోమవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఏఐసీసీ పరిశీలకురాలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అంజలి నింబాల్కర్ ఆధ్వర్యంలో ఈనెల 20 వరకు ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కొనసాగనుంది.

☛ శామీర్‌పేట్ మండలం తూంకుంట మున్సిపాలిటీ పరిధిలోని అంతాయిపల్లిలో సోమవారం నిర్వహించిన మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ సమావేశం సందర్భంగా జిల్లా అధ్యక్ష స్థానానికి 9 దరఖాస్తులు ఏఐసీసీ పరిశీలకురాలు అంజలికి అందాయి. అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ (కుత్బుల్లాపూర్), మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తోటకూర వజ్రేష్‌యాదవ్, నక్క ప్రభాకర్‌గౌడ్, సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, గోనె మహేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రాపోలు రాములు, రేణుకుమార్, పత్తికుమార్ తదితరులున్నారు. పార్టీలో సుదీర్ఘంగా పనిచేస్తున్న వ్యక్తులు, అధికారంలో లేకున్నా.. పార్టీకి అండగా ఉన్న వారు, ఇటీవల పార్టీలో చేరిన నాయకులు, సామాజిక సమీకరణాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని నియామక ప్రక్రియ పూర్తి చేస్తారని తెలుస్తోంది.